

ధోబీఘాట్‌లో నిర్మించిన హౌజ్‌లు

ధోబీఘాట్ సమస్యలను పరిష్కరించండి

షాపూర్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ధోబీఘాట్‌లో సమస్యలు పరిష్కరించాలని మడేలా ప్రజారజక సేవా సంఘం నాయకులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. సర్వేనెంబర్ 370/1లో రజకులకు కేటాయించిన ఎకరం స్థలంలో ధోబీఘాట్ నిర్మాణం చేపట్టారని, గత ప్రభుత్వం హయాంలో జీహెచ్ఎంసీ, ఎమ్మెల్యే ఫండ్స్ ద్వారా ధోబీఘాట్‌లో హౌజ్‌ల నిర్మాణం, ఒక గది, ప్రహరి, ప్రధాన ద్వారం గేటు, బోర్‌వెల్ నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కానీ పనులు అసంపూర్తిగా ఉండడంతో ధోబీఘాట్లఓ ఇంకా సమస్యలు ఉన్నాయని తెలిపారు. అసంపూర్తి నిర్మాణం కారణంగా ధోబీఘాట్ ప్రారంభోత్సవానికి నోచుకోలేదని సంఘం నాయకులు తెలిపారు. ఈ ధోబీఘాట్‌పై ఆధారపడి సుమారు 80 పేద కుటుంబాల జీవనం సాగిస్తున్నారని తెలిపారు. తమ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అసంపూర్తిగా ఉన్న ధోబీఘాట్ అభివృద్ధికి కృషి చెయ్యాలని కోరారు. సంఘం నాయకులు ఎం.చంద్రం, కార్యదర్శి మణిగొండ శంకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతిపత్రం ఇస్తున్న రజక సంఘ సభ్యులు

● **గాజులరామారంలో..**

బీఆర్ఎస్ ప్రభుత్వంలో కులవృత్తుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి, వారి ఆత్మగౌరవ భవనాలు నిర్మించామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రజక సంఘ సభ్యులు దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వారి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రజక సంఘాల అభ్యున్నతికి కృషి చేస్తానని, రానున్న రోజుల్లో వారికి మెరుగైన సదుపాయాలు కలుగజేస్తామన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు శింగారం మల్లేష్, చెట్ల వెంకటేష్, శంకర్, సాయిబాబా, సత్యనారాయణ, గణేశ్‌లు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్, నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

మియాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళ సాధికారిత, కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం పార్టీ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దళిత, గిరిజన, బహుజనుల మహిళ సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



ఎమ్మెల్యే గాంధీతో సాయినగర్ వాసులు

సాయినగర్ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

మియాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట సాయినగర్‌లో నెలకొన్న సమస్యలపై డివిజన్ అధ్యక్షుడు గౌతంగౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు బుధవారం ఎమ్మెల్యే గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాయిరాం కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, దశలవారీగా కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాండు ముదిరాజ్, బాబుగౌడ్, వెంకటేష్, జితేందర్, మల్లేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



గాంధీభవన్‌లో జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో బండి రమేష్

మల్కాజ్‌గిరి బరిలో ఎవరున్నా గెలిపించుకుంటాం

కూకట్‌పల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి బరిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అధిష్ఠానం ఎవరిని బరిలోకి నిలిపినా భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థాయి సమావేశంలో బండి రమేష్ పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, విష్ణునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ తరపున అభ్యర్థిగా ఎవరిని నియమించాలో నియోజకవర్గ ఇన్‌చార్జిల అభిప్రాయాలను తీసుకొన్నట్టు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, ఉప్పల్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు చెందిన ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరి

దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలు

గాజులరామారం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. బుధవారం గాజులరామారం డివిజన్‌లోని ఆదర్శనగర్, మెట్కాన్ గూడలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తాం

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

హైదర్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. బుధవారం హైదర్‌నగర్ భాగ్యనగర్‌కాలనీలోని పార్టీ కార్యాలయంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, వివేకానందనగర్, కూకట్‌పల్లి డివిజన్ల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సునీతారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల నమ్మకం నిలబెడతామని, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీని అందించి చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భాను ప్రసాద్, నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్‌గా నల్ల సంజీవరెడ్డి, వైస్ చైర్మన్ కృష్ణముదిరాజ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వీరేందర్‌గౌడ్, కూన సత్యం, శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షుడు మారేళ్ల శ్రీనివాస్, యాదగిరి, ఏకాంత్‌గౌడ్, శ్రీనివాస్, సందీప్‌ముదిరాజ్, వెంకటస్వామిసాగర్, పరుశురాం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్నం సునీతారెడ్డి

కాంగ్రెస్‌కు ప్రజల ఆశీర్వాదం బలంగా ఉంది

గచ్చిబౌలి: త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ వస్తుందని, కాంగ్రెస్ పార్టీకి ప్రజల ఆశీర్వాదం బలంగా ఉందని నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం మాదాపూర్, కొండాపూర్ డివిజన్ల కార్యకర్తల సమావేశం ఖానామెట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు తిరుగులేదన్నారు. ఎంపీని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లనూ అభివృద్ధి చేస్తామన్నారు.

ఓపెన్ నాలా పూడికతీత పనుల పరిశీలన

హైదర్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరికిచెరువు నుంచి ఆల్విన్ కాలనీ ఫేజ్-2 మీదుగా పైప్‌లైను రోడ్డు వరకు విస్తరించి ఉన్న ఓపెన్ నాలా, వరదనీటి కాలువలో పూడికతీత పనులను కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, ఏఈ శ్రావణితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓపెన్‌నాలా పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. వేసవిలో పనులు పూర్తి చేసి వర్షాకాలంలో వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌రెడ్డి, శ్రీనివాస్, పాండుగౌడ్, ప్రదీప్‌రెడ్డి, వర్క్ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

డ్రైనేజీ సమస్యను పరిష్కరించి రోడ్డు వేయండి

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భూగర్భ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి సీసీ రోడ్డు వేయాలని కార్పొరేటర్ మండడి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వసంతనగర్‌లో రోడ్డు నంబర్-4లో మంజూరైన రోడ్డు పనులు ప్రారంభించలేదని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు బుధవారం అధికారులు, అసోసియేషన్ సభ్యులతో కలిసి కార్పొరేటర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. జలమండలి అధికారులతో సమన్వయం చేసుకొని డ్రైనేజీ సమస్య పరిష్కరించి త్వరితగతిన రోడ్డు పనులు ప్రారంభించాలని సూచించారు. డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, వసంతనగర్ అధ్యక్షుడు యర్రా నాగేశ్వరరావు, డైరెక్టర్లు రజని, ప్రసాద్, దీన్‌దయాల్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో చర్చిస్తున్న కార్పొరేటర్ మండడి



చికితను సన్మానిస్తున్న జగన్

ఆర్చర్ చికితకు జగన్ బాసట

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతిక్రీడాప్రతినిధి): యువ నిరుపేద ఆర్చర్ టి.చికితకు అన్నివిధాలా అండగా ఉంటామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు హామీ ఇచ్చారు. బుధవారం మాదాపూర్‌లోని ఆయన కార్యాలయంలో చికిత, తన తండ్రితో కలిసి జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఇటీవల జరిగిన జాతీయ క్రీడల్లో స్వర్ణం, జాతీయ సీనియర్ ఆర్చరీ పోటీల్లో సాధించిన రెండు రజత పతకాలను జగన్‌కు ఆమె చూపించి, తన విజయాలు గురించి వివరించింది. ఆర్థిక ఇబ్బందులతో తాను ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె తెలిపింది. చికిత కష్టాలను విన్న జగన్, ఆర్థికంగానే కాకుండా అన్ని విధాలా అండగా ఉంటానని బాసటగా నిలిచారు. ఆర్చరీపైనే దృష్టిపెట్టి, కష్టపడాలని సూచించారు.

కారు ఇంజన్‌లో మంటలు

శంషాబాద్ రూరల్: ఇంజన్‌లో మంటలు చేలరేగడంతో కారు దగ్ధం అయింది. ఈ ఘటన బుధవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా పాండురంగా పురం, బల్లేపల్లికి చెందిన పాస్టర్ ఉపేందర్‌రావు స్నేహితులతో కలిసి కర్ణాటకలోని రాయ్‌చూర్‌కు కారులో బయలుదేరాడు. మదన్‌పల్లి గేటు సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా కారు ఇంజన్‌లో మంటలు వ్యాపించాయి. డ్రైవర్ రాజేష్ కారును పక్కకు ఆపగా, ఉపేందర్‌రావు తోపాటు కారులో ఉన్న ముగ్గురు బయటకు దూకి ప్రాణాలు దక్కించుకున్నారు.

అమలాపురం నుంచి హైదరాబాద్‌కు గంజాయి

ఇద్దరి అరెస్ట్.. రెండు కేజీలు స్వాధీనం

నిజాంపేట్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అమలాపురం నుంచి హైదరాబాద్‌కు గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకొని బాచుపల్లి పోలీసులకు అప్పగించారు. వారి నుంచి రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా అంబాజీపేట గ్రామానికి చెందిన అప్పన్‌కుమార్(28) కేవీఆర్ ట్రావెల్స్ బస్సులో క్లీనర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్(37) బాచుపల్లి సాయినగర్‌లో నివాసం ఉంటున్నాడు. కేవీఆర్ ట్రావెల్స్ బస్సులో రెండు కేజీల గంజాయిని హైదరాబాద్‌కు అప్పన్‌కుమార్ తీసుకొచ్చి, శ్రీనివాస్‌కు అందజేస్తుంటాడు. ఇలా తెచ్చిన గంజాయిని హైదరాబాద్‌లో విక్రయిస్తున్నారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం ప్రకారం మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు శ్రీనివాస్ ఇంటిపై దాడి చేసి రెండు కేజీల గంజాయిని పట్టుకున్నారు. శ్రీనివాస్, అప్పన్‌కుమార్‌ను బాచుపల్లి పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



పోలీసుల అదుపులో శ్రీనివాస్ అప్పన్‌కుమార్

కాకతీయనగర్‌లో డ్రైనేజీ నిర్మించాలి

నిజాంపేట్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ కాకతీయనగర్‌లో నూతన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చెయ్యాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత నాలుగైదు ఏళ్ల నుంచి ఓపెన్‌గా డ్రైనేజీ ప్రవహించడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. దీనికి తోడు విపరీతమైన దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సాయంత్రం అయిందంటే దోమలు ఎక్కువై ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయన్నారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే కాకతీయనగర్‌లో భూగర్భ డ్రైనేజీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రామచంద్రనాయక్, జగ్జీవన్‌రెడ్డి, విష్ణు, మార్తమ్మ, వెంకటస్వామి, మల్లికార్జున్, కిరణ్‌కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుందర్‌రామానాయుడు పాల్గొన్నారు.



కమిషనర్ రామకృష్ణారావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అంబేడ్కర్ వర్సిటీ వీసీని కలిసిన టీ శాట్ సీఈఓ

హైదరాబాద్ సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ.కె. సీతారామారావును టీశాట్ సీఈఓ బి.వేణుగోపాల్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీశాట్ సీఈఓను విశ్వవిద్యాలయ అధికారులు సన్మానించారు. ఈసందర్భంగా విద్యా వ్యాప్తి, తెలంగాణ నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఉపయోగపడేలా కార్యక్రమాలను రూపొందించి టీశాట్ ద్వారా ప్రసారం చేయాలని చర్చలు జరిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.ఏ.వీ.ఎన్.రెడ్డి, టీశాట్ జనరల్ మేనేజర్ పి.లింగా రెడ్డి పాల్గొన్నారు.



టీ శాట్ సీఈఓ వేణుగోపాల్ రెడ్డిని సన్మానిస్తున్న అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.సీతారామారావు, అధికారులు

16న జాబ్ మేళా

పంజాగుట్ట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): చింతలబస్తీలోని ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ రాజేందర్ సింగ్, కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజేంద్ర కుమార్ తెలిపారు. జంటనగరాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈజాబ్ మేళాలో రాక్ రిటైల్ ఇండి యా ప్రైవేట్ లిమిటెడ్, టీమ్ లీజ్, అపోలో ఫార్మసీ, వెల్త్ షాపి, తదితర సంస్థల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ లు నిర్వహిస్తాయన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్లు, రెజ్యూమ్ తీసుకొని ఈ నెల 16న ఉదయం కళాశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. ఆయా సంస్థల్లో మొత్తం 325 ఖాళీలు ఉన్నాయన్నారు. వివరాలకు 9849994111ను సంప్రదించాలని సూచించారు.

వార్డు కార్యాలయాల వద్ద ప్రజల బారులు

షాపూర్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులు వార్డు కార్యాలయాల వద్ద బారులు తీరారు. జీరో విద్యుత్ బిల్లులు, గ్యాస్ సబ్సిడీ లింక్ కోసం దరఖాస్తు చేసుకొనేందుకు సూరారం డివిజన్ నెహ్రూనగర్ వార్డు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద దరఖాస్తు చేసుకొనేందుకు బుధవారం ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. జీరో విద్యుత్ బిల్లు రాని వారు దరఖాస్తు చేసుకొనేందుకు విద్యుత్ సర్వీస్ నెంబరు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు రశీదు జిరాక్సులను అందజేయాలని అధికారులు తెలిపారు.గ్యాస్ సబ్సిడీకి గ్యాస్ నెంబర్, తెల్ల రేషన్ కార్డు, ఆధార్‌కార్డుతో లింక్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.



కేంద్రం వద్ద బారులు తీరిన జనం


ప్రేమ పేరుతో యువతికి వేధింపులు

హిమాయత్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడుతున్న యువకుడిపై చర్యలు తీసుకోవాలని ఓ యువతి నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నారాయణగూడలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న యువతి(24) స్థానికంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2021లో బీకాం పూర్తి చేసింది. అప్పటి నుంచి ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. అదే కాలేజీలో సీహెచ్.హరీశ్ కూడా తనతోపాటే చదువుకున్నాడు. ఆ సమయంల ఇద్దరి మధ్య ఉన్న పరిచయంతో నాలుక్ల నుంచి తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. 3 నెలల నుంచి హరీష్ యువతితె అసభ్యకరంగా మాట్లాడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆ యువతి జాబ్ చేసే ప్రాంతానికి వెళ్లి తిట్టడంతోపాటు చెంపపై కొట్టాడు. దీంతో హరీష్ వేధింపులు భరించలేక బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

24 గంటల్లోనే నిందితుల పట్టివేత

● **12న రోడ్డుపై వెళ్తున్న యువకుడిపై కత్తులతో దాడి కేసు**
● **ఇద్దరి అరెస్ట్** ● **పరారీలో మరొకరు**

రాజేంద్రనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిపై కత్తులతో దాడి చేసిన నిందితులను గుర్తించిన పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. మరొకరు పరారీలో ఉన్నాడు. 24 గంటల్లోనే నిందితులను పట్టుకుని కటకటాల్లోకి నెట్టారు. బుధవారం అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. బిహార్‌కు చెందిన నితిన్(27) నగరానికి వచ్చి హైదర్‌గూడలోని ఓ హోటల్‌లో సర్వెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 12వ తేదీ (మంగళవారం) తెల్లవారుజామున స్నేహితులతో కలసి నడుచుకుంటు వెళుతున్న మలాకర్ నితీశ్‌కుమార్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేయగా, బాధితుడు అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. దాడికి పాల్పడింది అత్తాపూర్ సాయినగర్ కాలనీకి చెందిన పాన్ షాపు నిర్వాహకుడు రామ్ లింగ్‌లుల్లే(23), నందిముస్లయిగూడ మారుతీనగర్‌కు చెందిన ర్యాపిడో రైడర్ చిట్టి శివలింగ్(23), మరో వ్యక్తి శంకర్‌గా గుర్తించారు. రామ్‌లింగ్ లుల్లే, చిట్టి శివలింగ్‌లను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో వ్యక్తి శంకర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



కాముని చెరువు బఫర్ జోన్‌లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం

బఫర్‌జోన్‌లో నిర్మాణంపై చర్యలకు ఆదేశం

కూకట్‌పల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధి బాలాజీనగర్ డివిజన్‌లోని కాముని చెరువు బఫర్‌జోన్ పరిధిలో రామచంద్రకాలనీలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణంపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ నీటిపారుదల శాఖ డీఈఈ నరేందర్‌కుమార్ కూకట్‌పల్లి తహసీల్దార్, మూసాపేట సర్కిల్ ఉపకమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సదరు నిర్మాణంపై ఎక్స్ వేదికగా ఫిర్యాదు అందుకోవడంతో పాటు నీటిపారుదల శాఖ అధికారులు స్వయంగా పరిశీలించారని తెలిపారు. చెరువు బఫర్ జోన్‌లో భవన నిర్మాణం కొనసాగుతున్నట్లు సర్వేలో తేలిందని ఆయన ఉత్తర్వులో పేర్కొన్నారు. కూల్చివేత ఆదేశాలకు సంబంధించిన కాపీని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, కూకట్‌పల్లి పోలీసులకు కూడా పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

కవయిత్రి మొల్లమాంబకు నివాళి

చందానగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చందానగర్‌లో కవయిత్రి మొల్లమాంబ జయంతి కార్యక్రమాన్ని గ్రేటర్ హైదరాబాద్ శాలివాహన ప్రజాపతి సంఘం చైర్మన్‌ఉరిటి వెంకట్రావ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ శ్రీను, అధ్యక్షుడు హరికృష్ణ, ఉపాధ్యక్షుడు సుబ్బారావు, ఏడు కొండలు, నాగేశ్వరరావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం ప్రతినిధులు

14, 15 తేదీల్లో జాతీయ సదస్సు

పంజాగుట్ట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 14,15 తేదీల్లో 'భారతదేశంలో ఉన్నత విద్య-సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు నూతన విద్యావిధానంలో సవాళ్లు-అవకాశాలు అనే అంశంపై రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేంద్రకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులతో పాటు రాష్ట్రంలోని పలు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, విశ్వవిద్యాలయాల ఆచార్యులు పాల్గొంటారని తెలిపారు. సదస్సులో 100కి పైగా పరిశోధనా పత్రాలు అందజేస్తారని వివరించారు.

అటానమస్ కాలేజెస్ ఎఫైర్స్ డైరెక్టర్‌గా ప్రొ.రవీంద్రారెడ్డి

జేఎన్‌టీయూలో మరో ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లకు స్థానచలనం

హైదరాబాద్ సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో అటామనస్ కాలేజెస్ అఫైర్స్ విభాగం డైరెక్టర్‌గా మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ బి.రవీంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెసర్ రవీంద్రారెడ్డి గతంలో ఎంసెట్ కో-ఆర్డినేటర్‌గా, పీజీఈసెట్ కన్వీనర్‌గా, ఆర్ అండ్ డీ, అకడమిక్ ఆడిట్ విభాగాలకు డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరించారు. అలాగే మరో ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లకు స్థానచలనం కల్పించారు. అకడమిక్ ప్లానింగ్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ శ్వేతను అఫిలియేషన్స్ అండ్ అకడమిక్ ఆడిట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్‌గా, యూజీసీ-హెచ్‌ఆర్‌డీ విభాగం డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ఎన్వీ రమణను అకడమిక్ అండ్ ప్లానింగ్ విభాగం డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేస్తున్నట్లు రిజిస్ట్రార్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజా నియామకాలు, బదిలీల ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు.



ప్రొ.రవీంద్రారెడ్డి

ముళ్లకత్వ చెరువు ఎస్టీపీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

కూకట్‌పల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి రూ.400 కోట్ల నిధులు విడుదల చేసిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలాజీనగర్ డివిజన్ రెయిన్‌బో విస్తా సమీపంలో, హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ముళ్లకత్వ చెరువులో నిర్మిస్తున్న ఎస్టీపీల నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఎస్టీపీలు అందుబాటులోకి వస్తే నాలాలు, చెరువుల్లోకి మురుగునీరు వెళ్లకుండా చూడడంతో పాటు మురుగునీటిని శుద్ధి చేసి మంచినీటిని చెరువుల్లోకి పంపడం వలన పర్యావరణానికి పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. అంతేకాకుండా చెరువుల సమీపంలో నివసించే వారికి దుర్వాసన, దోమల బెడద తప్పుతుందన్నారు. ఎస్టీపీల నిర్మాణ పనుల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా, నిధుల సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శిరీష, నాయకులు ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

చిత్తారమ్మ ఆలయ ముఖద్వారం ప్రారంభం

కూకట్‌పల్లిలోని చిత్తారమ్మ ఆలయంలో నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ తులసీరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చెరువు వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు